క్లుప్తంగా

మిర్యాలగూడకు నేడు సినీ నటుడు సుమన్ రాక

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే కరాటే బెల్ట్ సర్టిఫికేట్ల బహుమతి ప్రదానోత్సవానికి ప్రముఖ సినీ నటుడు, షోటోఖాన్ కరాటే ఆకాడమి ఆఫ్ ఇండియా చైర్మన్ సుమన్ హాజరుకానున్నట్లు, ఆ ఆకాడమి మాస్టర్ బూడిద సైదులు, బాణావత్ రామకృష్ణానాయక్ గురువారం విలేకరులకు తెలిపారు. సినీ నటుడు సుమన్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కూడా హాజరుకానున్నట్లు తెలిపారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం

డిండి : నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంటలోని ఎస్‌ఎల్‌బీసీ టన్నెల వద్దకు వెళ్తున్న క్రమంలో మాజీ నీటి పారుదల శాఖమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు డిండి మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, కిషోర్, భాస్కర్‌రావు, కిషన్‌నాయక్, ఆర్ వీఆర్, జి. శ్రీను, సురేష్, లింగమయ్య, రశీదు, బాషీదు, తిర్పతయ్య ఉన్నారు.

లింగేశ్వరాలయంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలో వాయు లింగేశ్వర దేవాలయంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవాలయంలో లింగోద్భవ కాలంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్ష ఉపసంహరణ అనంతరం ఆలయం వద్ద అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బత్తుల నాగరాజు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ బత్తుల రామయ్య, బండారు శ్రీనివాస్, కృష్ణ, నాగభాస్కర్, రామసాయి, శ్రీకాంత్, విజయకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



బ్యాటింగ్ చేసి క్రీడలు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ : క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 19వవార్డు శ్రీనగర్‌కాలనీలో క్రికెట్ క్రీడను ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో రఘు, వినయ్, వెంకన్న, శ్రవణ్, చారి, మారగోని గణేష్, కొంగరి సైదులు, కొప్పు శ్రీకాంత్, యాటల వెంకన్న, మేడి నరసింహ, పెద్దులు, గిరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీలోకి నేరేడుచర్ల వాసులు

నేరేడుచర్ల : ఆర్యవైశ్య సంఘం సూర్యాపేట జిల్లా కార్యవర్గంలోకి నేరేడుచర్ల నుంచి 21 మందికి స్థానం కల్పించారు. ఈమేరకు గురువారం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్లు వారికి నేరేడుచర్లలో నియామకపత్రాలు అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా రాచకొండ రాంమోహన్‌రావు, రాచకొండ శ్రీనివాస్‌రావు, పోలా విశ్వనాథం, తడకమళ్ల నర్సింహస్వామి, భువనగిరి అంజయ్య, రాచకొండ నాగ మాధవరావు, కందిబండ శ్రీనివాస్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శులుగా ఊట్కూరి నటరాజ్, మాశెట్టి సైదయ్య, నీలా శ్రీనివాస్, గోళ్ల సుధాకర్, ఈగా శ్రీనివాస్‌రావు, కొత్త లక్ష్మణ్, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా పలువురు నియమితులయ్యారు.

దర్జీ బతుకుల్లో దర్జా మాయం!

- రెడీమేడ్ దుస్తుల రాకతో ఉపాధి కోల్పోతున్న టైలర్లు
- వృత్తి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు
- నేడు ప్రపంచ టైలర్స్ దినోత్సవం

త్రిపురారం : ఒకప్పుడు దర్జీల బతుకులు సాఫీగా సాగేవి. గ్రామీణ ప్రాంతాలతో పాటుగా పట్టణ ప్రాంతాల్లో సైతం ప్రజలు బట్టలకు కోసం టైలర్ల వద్దకు వెళ్లి తమకు నచ్చినట్టుగా దుస్తులను కుట్టించుకునే వారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా రెడీమేడ్ దుస్తుల మార్కెట్‌లోకి రావడంతో టైలర్ల వద్ద దుస్తులు కుట్టించుకునే వారు కరువయ్యారు. ఒకప్పుడు టైలర్ అంటే గొప్పగా చూసేవారు. నేడ వస్త్ర రంగా ఫ్యాషన్ రంగంలో చోటుచేసుకుంటున్న ప్రభావం దర్జీలపై పడింది. వినియోగదారుడు టైలర్ షాపులో డ్రెస్ కుట్టించుకుంటే రూ.350తీసుకుంటున్నారు. అదే కుట్టు కూలి ధరకు రెడీమేడ్ షాపులో కొత్త కొత్త డిజైన్లతో డ్రెస్ వస్తున్నాయి. దీంతో వినియోగదారుడు రెడీమేడ్‌పై ఆసక్తి చూపుతున్నారు.



బొర్రాయిపాలెంలో టైలరింగ్ చేస్తున్న సుబ్బయ్య

త్రిపురారంలో 450కుటుంబాలకు ఆధారం

టైలర్ వృత్తిపై ఆదారపడి మండల వ్యాప్తంగా గ్రామాల్లో సుమారు 450 కుటుంబాల వరకు జీవిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నూతన పోకడలకు అనుగుణంగా వెలుగు చూసే ఫ్యాషన్లు కోరుకునే వారెందరినో మెప్పిస్తూ మార్కెట్‌లోకి పెద్ద పెద్ద రెడీమేడ్ సంస్థలు స్థాపించి పోటీ పడుతుండడంతో వాటి సవాళ్లను ఎదురొడ్డి మనుగడ సాధించడంలో దర్జీల వృత్తి కత్తిమీద సాములా మారింది. ఏళ్ల తరుబడి ఈ వృత్తిలో పని చేసి వేరే పనులు చేయలేక అదే వృత్తిని నమ్ముకొని టైలర్లు వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఆర్థిక స్థితి లేని వరి కొంత మంది మండల కేంద్రాల్లో ప్రధాన రహదారికి ఇరువైపుల చిన్న చిన్న షాపులు, డబ్బాలు బట్టల షాపుల ముందు మిషన్లు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. టైలరింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం మహిళలు, యువత టైలరింగ్ ద్వారా ఉపాధి పొందుతున్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



42 ఏళ్లుగా టైలర్ వృత్తితోనే కుటంబాన్ని పోషిస్తూ జీవిస్తున్నాం. మారుతున్న కాలానికి అనుగుణంగా టైలర్లు మార్పులు చేసుకుంటూ పని చేసుకుంటే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం మహిళలు చాలా మంది టైలర్ వృత్తిలోకి వస్తున్నారు. చాలా మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చాను. టైలర్ వృత్తిలో నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడం అవసరం. మార్కెట్‌లోకి ఎన్ని రెడీమేడ్‌స్తువులు వచ్చినా టైలర్ చాలా అవసరం. సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త డిజైన్లు నేర్చుకుంటూ టైలరింగ్‌తో ఉపాధి పొందవచ్చు. ప్రభుత్వం టైలర్లను అన్ని విధాలుగా ఆదుకోవాలి.

– మాశెట్టి సుబ్బయ్య, బొర్రాయిపాలెం

కుట్టించుకునే వారు తక్కువయ్యారు



40 ఏళ్లుగా టైలరింగ్ వృత్తి చేస్తున్నాము. రెడిమెడ్ దుస్తువుల వల్ల బట్టలు కుట్టించుకునే వారు తక్కువ అయ్యారు. కాని టైలరింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం విరివిగా పెరగడంతో టైలరింగ్ ద్వార నూతన డిజైన్‌లు కుడుతున్నాం. ఇప్పుడు మహిళలు కూడా టైలరింగ్ వృత్తిలోకి వచ్చి ఆర్థికంగా కుటుంబానికి అండగా ఉంటున్నారు. ప్రభుత్వం టైలరింగ్‌ను ఆదరించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తే మరింత మందికి ఉపాధి దొరుకుతుంది. ప్రభుత్వం టైలరింగ్ షాపులను ఆర్థికంగా అండగా ఉండాలి.

– రాపర్తి ధనుంజయ్య, త్రిపురారం

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్



మిర్యాలగూడ : ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు



హాలియా : ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉపాధ్యాయుడు

మిర్యాలగూడ : మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా పది మండలాల పరిధిలో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పది మండలాల పరిధిలో 1314 మంది ఓటర్లు ఉండగా 1248 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డివిజన్ వ్యాప్తంగా 94.98శాతం పోలింగ్ నమోదైంది. అడవిదేవులపల్లి మండలంలో వందశాతం నమోదు కాగా, వేములపల్లి మండలంలో అత్యల్పంగా 88.89శాతం పోలింగ్ నమోదైంది. మాడుగులపల్లి మండలంలోని పోలింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌లు తనిఖీ చేయగా మిర్యాలగూడ బకల్‌వాడీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తనిఖీ చేశారు.

దేవరకొండలో 93.70శాతం

దేవరకొండ : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం దేవరకొండ డివిజన్‌లో ప్రశాంతంగా ముగిసింది.ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 4గంటల వరకు కొనసాగింది.డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో ఒక్కో మండలంలో ఒక్కో పోలింగ్ కేంద్రం చొప్పున మొత్తం 9పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.పోలింగ్ నేపథ్యంలో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు 144సెక్షన్‌ను అమలు చేశారు.దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని పరిశీలించారు.ఉదయం ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ కొంత మందకొడిగా సాగినా మధ్యాహ్నం తర్వాత పుంజుకుంది.డివిజన్ పరిధిలో 556ఓట్లకు గాను 521ఓట్లు పోల్ కాగా 93.70శాతం పోలింగ్ నమోదైనట్లు దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు.దేవరకొండ మండలం లో 221 ఓట్లకు గాను 207ఓట్లు పోలయ్యాయి.పోలింగ్ అనంతరం ఎన్నికల సిబ్బంది పోలీస్ బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్స్‌లను జిల్లా కేంద్రానికి తరలించారు.



దేవరకొండ : బ్యాలెట్‌బాక్స్‌లను నల్లగొండ స్ట్రాంగ్ రూంకు తరలిస్తున్న అధికారులు

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గంలో గురువారం జరిగిన వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 388 మంది ఓటర్లు ఉండగా366 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. అనుముల మండలంలో 91 మంది ఓటర్లు ఉండగా 86 మంది ఉపాధ్యాయులు ఓటు వినియోగించు కున్నారు. పెద్దవూర మండలంలో 103 మందికి 94 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తిరుమలగిరి(సాగర్) మండలంలో 41 మందికి 39 మంది, త్రిపురారం మండలంలో 77 మందికి 75 మంది, నిడమనూరు మండలంలో 49 మందికిగాను 47 మంది, గుర్రంపోడు మండలంలో 26 మంది 25 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు.

భక్తిభావాన్ని కలిగి ఉండాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం పట్టణంలోని శివాలయంలో, లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లారీ అసోసియేషన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

త్రిపురారం : ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా గురువారం నిడమనూరు మండలంలోని ముప్పారంలో శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గ్రామస్తులు స్వామి వారి కల్యాణ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పాండురంగారెడ్డిని శాలువతో సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

శంభులింగేశ్వరస్వామి ఆలయంలో అగ్నిగుండాలు



అగ్నిగుండాల ప్రవేశం చేస్తున్న భక్తులు

వేములపల్లి : మండల కేంద్రంలోని శ్రీ శంభు లింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం అగ్నిగుండాల ప్రవేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఉగ్రదండి హరిప్రసాదశర్మ ఆధ్వర్యంలో భక్తులు శివనామస్మరణ చేస్తూ స్వామివారిని ఎత్తుకొని అగ్నిగుండాల ప్రవేశం చేశారు. అనంతరం స్వామివారిని గ్రామ పురః వీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్న భక్తులకు ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించగా భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పబ్బతి కరుణాకర్, సాదు నరేందర్, కృష్ణమూర్తి, రేగట్టి రవీందర్‌రెడ్డి, పబ్బతి భాస్కర్, రవి, రేపాల ఆనంద్, శంకరాచారి, చిన్నాచారి, నాగవెల్లి కృష్ణ, శ్రీనివాస్, జడ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై గుర్తు తెలియని వ్యక్తి దాడి

దేవరకొండ : వారం రోజుల క్రితం దేవరకొండ పట్టణ శివారులోని తాటికోల్ రోడ్డులో ఓ మహిళపై గుర్తు తెలియని వ్యక్తి దాడికి పాల్పడి గాయపర్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేవరకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు ప్రాంతంలో భిక్షాటన చేస్తూ ఓ మహిళ జీవనం కొనసాగిస్తుంది.ఈ క్రమంలో గత శుక్రవారం సాయంత్రం దేవరకొండకు ఆమెతో పాటు వచ్చిన ఒక వ్యక్తి పట్టణ శివారు ప్రాంతంలోని క్రీడా స్టేడియం వద్ద ఘర్షణ పడి ఆమెపై దాడి చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం ఇది గమనించిన స్టేడియం వాచ్‌మెన్ దేవరకొండ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని గాయపడిన మహిళను దేవరకొండ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఆమె వెంట ఉన్న వ్యక్తే గొడవపడి దాడి చేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు విచారణ చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు కుల గణనపై సమీక్ష సమావేశం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో కుల గణన, సమగ్ర కుటుంబ సర్వేపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హరిబాబు, సహాయ బీసీ సంక్షేమ అధికారి ఎస్తేరు, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌లు సంయుక్తంగా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి బీసీ కమిషన్ సభ్యులు సురేందర్ హాజరవుతున్నట్లు తెలిపారు.

రెడ్ నోటీసుదారులకు రెండు రోజులే గడువు



ఆస్తి పన్ను వసూళ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో రెడ్ నోటీసులు అందుకున్న వారు ఆస్తి పన్ను చెల్లించడానికి మరో రెండు రోజుల గడువు మాత్రమే ఉందని మున్సిపల్ కమిషన్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. గురువారం పట్టణంలోని చైతన్యనగర్, వాసవి నగర్‌లలో వార్డు ఆఫీసర్లు చేస్తున్న ఆస్తి పన్ను వసూళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం గృహాల యజమానులను ఆస్తి పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఆస్తి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని, ఇప్పటికే రెడ్ నోటీసులు ఇచ్చామని, వారికి రెండు రోజుల సమయం మాత్రమే ఉందని తెలిపార. అదే విధంగా మొండి బకాయిదారులకు కూడా నోటీసులు ఇవ్వడం జరిగిందని, పన్నులు చెల్లించకుంటే ఆస్తులను జప్తి చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు వార్డు ఆఫీసర్లు తదితరులున్నారు.

దరఖాస్తులపై పునర్విచారణ చేయాలి

మఠంపల్లి : మండలంలో పైలట్ గ్రామంగా ఎంపికైన రఘునాథపాలెంలో గత ఏడాది నిర్వహించిన ప్రజాపాలనలో వచ్చిన 2220 దరఖాస్తులపై పకడ్బందీగా పునర్విచారణ చేపట్టాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాపాలన దరఖాస్తుల పునర్విచారణకు మొత్తం ఏడు టీమ్‌లుగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క టీమ్‌కు ముగ్గురు చొప్పున 21 మంది ఉన్నట్లు తెలిపారు.

జాతీయ మార్కెట్ విధానాన్ని వ్యతిరేకించాలి

నల్లగొండ టౌన్ : జాతీయ మార్కెట్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మాణం చేయాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మిర్చి, టమాటకు మద్దతు ధర పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రుణమాఫీ, రైతు భరోసా పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. సీజన్‌లో అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలన్నారు. వ్యాపారులు కృత్రిమ కొరత చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ మోహినోద్దిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రయ్య, వర్కింగ్ కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు దేప సుదర్శన్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి జిల్లా కనకయ్య, కోశాధికారి శ్రేఖర్, జిల్లా కమిటీ సభ్యులు దోటి పాండరి, తీగల మల్లారెడ్డి, పల్లా రంగారెడ్డి, బండమీది వెంకన్న, యాదయ్య, పాడు, శేఖర్‌రెడ్డి, పద్మ, అంజన్‌రావు, శ్రీశైలం, మాధవరెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివ పార్వతుల కల్యాణం



హాలియా : పేరూర్‌లో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



మిర్యాలగూడ : అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో..



పెద్దవూర : బట్టుగూడెంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన ఇష్టకామేశ్వరస్వామి

పెద్దవూర : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బట్టుగూడెం గ్రామంలోని శ్రీ ఇష్టకామేశ్వర స్వామి దేవాలయంలో శివ పార్వతుల కల్యాణం వేదపండితుల మంత్రోఛ్ఛారణలతో గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, భక్తులు జాగారాలు చేశారు. రెండో రోజున శివ పార్వతులకు కల్యాణాన్ని జరిపించారు. స్వామివార్లకు నూతన పట్టువస్త్రాలను భక్తులు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా దేవాలయానికి తీసుకునివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు అనంతరామశర్మ ఆధ్వర్యంలో అమ్మవారి తాళిబొట్టును భక్తులకు చూపించి అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. మహిళలు వేసిన దాండియా కోలాటం భక్తులను అలరించింది. అనంతరం కల్యాణం సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూన్‌రెడ్డి శేషిరెడ్డి, నక్కల నాగిరెడ్డి, కూన్‌రెడ్డి రామాంజిరెడ్డి, కూన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, సముద్రాల విజయ్‌కుమార్, రామాంజిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, కూన్‌రెడ్డి గోవింద రెడ్డి, కత్తి ముత్యాల్‌రెడ్డి, కనకాల్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సతీష్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, లింగారెడ్డి, శంకర్‌రెడ్డి, దేశ్‌కుమార్, కాంతయ్య, పాల్గొన్నారు.

మల్లప్పాయ శివాలయంలో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని రాజవరం శివారులోని మల్లప్పాయ శివాలయంలో గురువారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తుల జాగారాలతో బుధవారం రాత్రి శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. రాజవరం గ్రామస్తులు ప్రభలను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్ల ద్వారా ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి తీసుకువచ్చారు. వెంకటేశ్వరశర్మ అర్చక బృందం వేద మంత్రోచ్చరణ నడుమ కల్యాణ తంతు నిర్వహించారు. ఈ ఆలయం పూర్తిగా దట్టమైన అడవి ప్రాంతంలో ఉండటంతో ఆయా మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బుసిరెడ్డి పౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొల్లేపల్లి రమణరాజు, మాజీ వైస్ చైర్మన్ యడవల్లి దిలీప్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ పోలేపల్లి సైదమ్మఅంజి, నాయకులు మల్లయ్య, బుర్రి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని కామరెడ్డిగూడెం గ్రామ పంచాయతీలో మహాశివరాత్రి గౌరిశంకర స్వామి వారి కల్యాణం గురువారం గ్రామ భక్తబృదం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పంతంగి రామకృష్ణ మూర్తి సమక్ష్యంలో గ్రామ పురోహితులు దుగ్గిరాల శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ జరిపించారు. అనంతరం సుమారు 2000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కామరెడ్డి గ్రామ భక్తబృందం, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హాలియా : మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా అనుముల మండలంలోని పేరూర్ గ్రామంలోని స్వయంభూ శ్రీ సోమేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని గురువారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. అర్చకులు గంగపురం రాకేష్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణ నడుమ స్వామివారి కల్యాణ తంతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రిక్కల కొండారెడ్డి, దేవాదాయ శాఖ ఈవో వెంకటనారాయణ, వికారాబాద్ సీఐ ఆఅంజనేయులు, కృష్ణయ్య, రామలింగ యాదవ్, వాకుల రాజు, సాంబయ్య, కమిటీ సభ్యులు శ్రీనయ్య, సునితరాంబాబు, వెంకన్న, సైదాచారి, పాండునాయక్, నర్సింహ్మా పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాభిషేకం

పెద్దవూర: మండలంలోని బట్టుగూడెం గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం అర్ధరాత్రి సమయంలో శివుడికి లింగోద్భావ సమయంలో పంచామృతాలతో రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. మహ శివరాత్రికి ఉపవాస దీక్షలో ఉన్న భక్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు మహారుద్రాభిషేకానికి అధిక సంఖ్యలో హాజరయ్యారు. జాగారం సమయంలో దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోదాడకు చెందిన మురళీ భజనలు భక్తులను ఉర్రూతలూగించాయి. లింగోధ్భావ కాలంలో ఇష్టకామేశ్వరుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో దేవాలయ ప్రాంగణం శివనామ స్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సూరభట్ల అనంతరామశర్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి శ్రీపార్వతీవర్ధిని సమేత అగస్త్యేశ్వరస్వామి వారి కల్యాణాన్ని ఆలయ నిర్వహణ ధర్మకర్త, జిల్లా రైతుబంధు సమి తి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి గ్రామ సమీపంలోని కృష్ణానది ఒడ్డున గల బౌద్ధమ ఆలయంలో బుధవారం రాత్రి పార్వతి పరమేశ్వరుల కల్యాణం ఆలయ ప్రధాన అర్చకులు ఎడవల్లి రఘురామశర్మ, అనంత కృష్ణ శర్మల వేద మంత్రోత్సవాల మధ్య అంగరంగా వైభవంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.



తిరుమలగిరి(సాగర్) : కల్యాణంలో పాల్గొన్న భక్తులు




పెద్దవూర : శివపార్వతుల కల్యాణానికి హాజరైన భక్తులు



త్రిపురారం : కామరెడ్డిగూడెంలో..

రోడ్డు వెంట ప్రమాదకర గుంత



కోమటిగూడెం వద్ద రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంత

త్రిపురారం : మండలంలోని దుగ్గెపల్లికి వెళ్లే రహదారిలో కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోమటిగూడెం గ్రామ సమీపంలో రోడ్డు వెంట మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మత్తుల కొసం తవ్విన గుంత ప్రమాదకరంగా ఉంది. సింగిల్ రోడ్డు కావడంతో గుంత రోడ్డుపైనే ఉండడంతో వాహనదారులు నానాఅవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై వాహనాల రద్దీ అధికంగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు ఇరుకుగా ఉండి గుంత రోడ్డు పక్కనే ఉండడంతో రాత్రి వేళలో గుంత వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. భగీరథ పైప్‌లైన్ మరమత్తులు వెంటనే పూర్తి చేసి గుంతను పూడ్చాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.